# సైస్మాలజీ - శ్రీశ్రీ

జ్ఞానం మనిషిని కలుషితం చేసిన మరుక్షణం వాడు చితికిన పాదరస బిందువు... ఎన్నిసార్లు ఒక్కటిగా చేసినా వాణ్ణి వాడు జారవిడుచుకుంటూ శతసహస్రాలుగా చిట్లిపోతూనే ఉంటాడు..

* * *

ఈ ఘటన ఘటించి ఓ పదిహేనేళ్లు పైబడే వుంటుంది. నేనప్పుడు నా బాల్యమిత్రుడు రమణ ఓపెన్ చేసిన ఓ డిపార్ట్‌మెంట్ స్టోర్సులో పనిచేస్తున్నాను. మా వాడికి చాలా డీలర్ షిప్పులుండేవి. ఆయా కంపెనీల రెప్రజంటేటివ్‌లూ... సేల్స్ మేనేజర్లూ.. కొండొకచో చిన్న చిన్న కంపెనీల యజమానులూ... నానా హడావిడిగా ఉండేది. అంత షోరూంకీ నేనూ, మా రమణావాడి అన్న విఠలూ, ఇంకొక అబ్బాయి మాత్రమే స్టాఫ్. విఠల్‌ని మా స్నేహితులంతా "అన్నయ్యా!" అనే వాళ్లం. వాడు అప్పట్లో మాకో వాకింగ్ ఎన్సైక్లోపీడియా. ఎమ్మెస్సీ మ్యాథమాటిక్స్ చదివి ఆ తర్వాత ఆటోమొబైల్ ఇంజనీరింగు ఫస్టన ప్యాసై. కర్నూలు వచ్చి ఓ ఆటో గ్యారేజి తెరవాలనుకుని, ఇంట్లో వాళ్లతో పడక చివరాఖరికి ఓ పచారీ కొట్టు తెరచి ఆవాలూ, జీలకర్ర, చింతపండూ, కందిపప్పు కళాత్మకంగా పొట్లాలు కట్టడం నేర్చుకుని, అదీ మూసిపారేసి మా రమణ తెరిచిన స్టోర్స్‌లోకి భాగస్తుడిగా వచ్చాడు.

స్టోర్సు కట్టేసే వరకూ రాత్రి పన్నెండు, ఒంటిగంటైనా ముగ్గురం ఉండేవాళ్లం.

షోరూంకొచ్చే రెప్‌లూ, ఏజెంట్లూ, సబ్ డీలర్లూ అందరితోటీ చాలా చనువుగా ఉండేవాళ్లం. అట్లా వచ్చేవాళ్లలో కామేశ్వరరావుని 'ఉషా' కంపెనీ ఫ్యాన్లు అమ్మడానికొచ్చే రెప్రజెంటేటివ్‌తో ఇంకాస్త చనువుగా ఉండేవాళ్లం. ఆ చనువు ఏరా! ఏరా! అనుకునే వరకూ వచ్చింది. వాడిని ప్రేమగా 'కావుఁడూ!' అని పిలిచేవాళ్లం. వాడు కూడా అర్ధరాత్రి అపరాత్రి అనకుండా హైదరాబాదునించి దిగబడి పోయేవాడు.

కొండొకచో స్టోర్సు షట్టర్లు మూసేసున్న పక్షాన నేనూ, అన్నయ్య (విఠల్) ఉండే అడ్డా తెలుసు వాడికి. ఆ అడ్డాను కూడా చుట్టేసి ఇక అక్కడా లేకపోతే లాడ్జికి వెళ్ళిపోయేవాడు.

* * *

ఓ మధ్యరాత్రి స్టోర్స్ షట్టర్లు మూసేసింతర్వాత, నన్నూ అన్నయ్యనూ వదిలేసి మరునాడు ఇంటికెళ్లిపోయాడు – ఎవరో బంధువులొచ్చారు, అర్ధరాత్రైనా కొంప చేరకపోతే బావుండదని, సరే నేనూ అన్నయ్య మా అడ్డాకు వచ్చి కూచున్నాం. అడ్డా అంటే అదేదో గొప్ప గెస్ట్‌హౌస్ కాదు. రోడ్డు అంటే అదేదో గొప్ప గెస్ట్‌హౌస్ కాదు. రోడ్డు వారగా ఉంటే ఓ టీ బండి. బూవమ్మ అనే పెద్దావిడ ఆమ్లెట్లు కూడా వేస్తూ దాదాపు రాత్రి రెండు వరకూ ఉండేది. అదీ చిన్న స్టూళ్ల మీద నేనూ, అన్నయ్యా సిగరెట్టు కాలుస్తూ కడుపులో చేరిన కాలకూటాన్ని కరిగించే ప్రయత్నంలో ఉండగా 'హాయ్' అని చేతిలో బ్రీఫ్‌తో మా...వుడు దిగబడ్డాడు. బాగా అలసిపోయి ఉన్నాడు. తలమీదున్న నాలుగు పోచలూ ...గున్నాయి.

"ఛc ఛc ఛc హెక్టిక్ జర్నీరా... వైజాగూ, భీమునిపట్నం, హైదరాబాదూ మళ్లీ ఇదుగో కర్నూలు..." అని సిగరెట్ వెలిగించాడు. అప్పటికి అన్నయ్య సందులో వెళ్లి ఇంకో పెగ్ పీకాడు.

"ఏమిటి భీమిలి వెళ్లావా? ఎర్రమట్టి దిబ్బలు చూశావా?" అనడిగాడు. అమాయకంగా కనిపించి వినిపించే ఆ ప్రశ్న ట్రాప్‌లో కాముడు 'ఢబీ'మని చిక్కుకుపోయాడు. 'అవున్రా అన్నాయ్! అక్కడ ఆ ఎర్రమట్టి దిబ్బల మధ్యన పొడి ఊబులు ఉంటాయట. చాలా జాగ్రత్త అన్జెప్పారు మా వాళ్లు" అన్నాడంతే కాముడు. ఇక షురూ... మా కాముడు ఫినిషు....

"అసలు ఊబులు ఎట్లా ఏర్పడతాయి. పొడి ఊబికీ తడి ఊబికీ తేడా ఏమిటి? యూనో జియోడెసీ కాముడూ? జియోడేసీ తెలీదా? జియోఫిజిక్స్ బ్రాంచ్ అది. అప్లైడ్ మ్యాథమాటిక్స్. చదూకోవాలి బాబూ... ఎడ్యుకేషన్ కావాలి. బ్రీఫింగాఫ్ జియోఫిజిక్స్ యిస్తా చదువు. అన్ని బ్రాంచ్‌లూ కొద్ది కొద్ది గానైనా తెలుస్తాయి. హైడ్రాలజీ, ఓషనోగ్రఫీ, ఓల్కెనోలజీ, మీటియోరాలజీ, సైస్మాలజీ అన్నీ తెలుస్తాయి..."

కాముడి ముఖం ఆ చీకట్లో కూడా సప్తవర్ణాలూ మారి 'ఆc' అన్న కేక వాడి నోటి నుంచి వెలువడింది. అన్నయ్య వినిపించుకునేట్టు లేడు. కాముడు దిగ్గున లేచి బ్రీఫ్ పట్టుకుని "నేను లాడ్జీ కెళ్తా" అన్నాడు. "పద దిగబెడతాం" అని అన్నయ్య కూడా లేచాడు. కాముడు భయంగా మమ్మల్నిద్దర్నీ చూశాడు, గత్యంతరం లేక కదిలాడు. లాడ్జిలో రూం తీసుకున్నాడు. నేనూ అన్నయ్యా సోఫాల్లో సెటిలయిపోయాం. అన్నయ్య పేలుతూనే ఉన్నాడు. అదెంత వరకూ వెళ్లిందంటే – ప్లేట్ – టెక్టానిక్స్, కాంటినెంటల్ డ్రిఫ్ట్, హిమాలయాలూ ఎట్లా ఏర్పడ్డాయి? ఆవింకా పెరుగుతున్నాయా? అట్లా నిరాఘాటంగా.

కాముడికి సహనం నశించిపోయింది. మమ్మల్ని హత్య చేయాలన్న కాంక్ష నగ్నంగా వాడి కళ్లలో. ఇక టాపిక్ మారిస్తే తప్ప లాభం లేదని గ్రహించాడు. చిన్న చిన్నగా 'మనసున మనసై బ్రతుకున బ్రతుకై' హమ్‌చేస్తూ బ్రీఫ్‌లోంచి ఫ్రైడ్ రైస్ ప్యాకెట్టు చిన్నటానిక్ సీసా

తీశాడు. ఆ పాట అలా ఆలపించి ఊరుకొనుంటే బతికిపోయుండే వాడు. వాడి ఖర్మ. నావైపు చూసి 'శ్రీశ్రీ' కదరా ఈ పాట రాసిందీ? ఏం పాటరా...' అన్నాడంతే. అన్నయ్య టేపు పోయి నా టేపు కూచుంది.

'శ్రీశ్రీ చరమరాత్రి చదివావా? అసలు శ్రీశ్రీ, నారాయణబాబు, బైరాగి, ఆరుద్ర, కృష్ణ శాస్త్రుల్లో ఎవరు అసలు సిసలైన కవి...' అంటూ నేను తగులుకున్నాను. కాముడు బాత్రూం తలుపు దగ్గరికెళ్ళి అరచెయ్యి నోట్లో పెట్టుకుని కొరుక్కోడం చూశాం. అయినా మనం పట్టించుకోంగా.

అట్లా తెల్లారి మూడింటికి జవజీవాలు పోయిన కావుఁడి పిప్పిని వదిలేసి వచ్చాం నేనూ, అన్నయ్య.

* * *

మర్నాట్రోజుదయాన... బైటికొచ్చిన ఎర్రటి కనుగుడ్లతో... ఉన్న జుత్తు కాస్తా పీక్కున్నాడేమో.. రేగిన జుట్టుతో... తలమీద రెండు బొప్పుల్తో షోరూంకి వచ్చాడు కావుఁడు. మా రమణ వాడి వాలకమూ, తలమీద రెండు బొప్పులూ, చూసి "అవేంట్రా కావుడూ?" అనడిగాడు. వాడు వికటంగా నవ్వి "ఇది శ్రీశ్రీ, ఇది సైస్మాలజీ అహ్హహ్హా" అన్నాడు.

* * *

వ్యాసం మొదలుపెట్టిన వాక్యం గుర్తుంది కదండీ... మనకు చాలా చాలా జ్ఞానం ఉండొచ్చు... సమయం సందర్భం... అవతలి శ్రోత మానసిక, శారీరక స్థితీ అన్నీ గమనించుకుని వాళ్ల ఆసక్తిని బట్టి మాట్లాడితేనే మనకు గౌరవం... అది చాతకాని పక్షంలో 'మౌనం మహామంత్రం.' ●